
క్లుప్తంగా

పట్టభద్రులకు కృతజ్ఞతలు



జనగామ: వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలింగ్ రోజు అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం పట్టభద్రులు అత్యధిక సంఖ్యలో ఓటేసేలా కష్టపడిన నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యువత, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

పరామర్శ

పట్టణంలోని గిర్నిగడ్డకు చెందిన ఎమ్మెల్యే ఇంట్లో పని చేస్తున్న భాస్కర్ పెద్దమ్మ గంగరబోయిన గట్టమ్మ(67) మంగళవారం మృతి చెందింది. కాగా, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

'పల్లా'ను కలిసిన కురుమ సంఘం నాయకులు



బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లికి చెందిన కురుమ సంఘం నాయకులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని జనగామ క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన బీరప్పగుడికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని వారు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఆర్థికసాయం



చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన తిరుపతి స్వాతి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, చిల్పూరు ఆలయ శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావులు ఫోన్ ద్వారా మృతురాలి తండ్రి ఎల్లయ్యను పరామర్శించారు. బాధిత కుటుంబానికి శ్రీధర్‌రావు రూ. 5 వేలు పంపగా పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, బొట్టు చేరాలు, దార రాజు, గుర్రపు యాదగిరి, అశోక్‌పాల్ అందజేశారు.

నేలపోగులలో..

లింగాలఘణపురం: మండలంలోని నేలపోగులలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గౌని సోమక్క, సముద్రాల గౌరమ్మ కుటుంబాలను ఎంపీటీసీ నర్సయ్య పరామర్శించి ఒక్కొక్కరికి క్వింటా బియ్యం అందజేశారు. నాయకులు గైని ప్రవీణ్, మాజీ ఉపసర్పంచ్ ఎల్లమ్మ, యాగలక్ష్మి, ప్రభాకర్, నాగరాజు, కొంరయ్య, సత్తయ్య తదితరులు ఉన్నారు.

బొగ్గు లారీ బోల్తా



రఘునాథపల్లి: హనుమకొండ–హైదరాబాద్ జాతీయ రహదారిలోని రఘునాథపల్లి సిరి కాటన్ మిల్ ఎదుట బొగ్గు లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ టైరు పగలడంతో అదుపు తప్పి బోల్తాపడిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. భూపాలపల్లి నుంచి హైదరాబాద్ వైపు లోడ్‌తో వెళ్తున్న బొగ్గు లారీ మండల కేంద్రంలోని సిరి కాటన్ మిల్ వద్దకు రాగానే ముందు టైరు పేలి అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో లారీ డ్రైవర్ కృష్ణారావు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



పాలకుర్తి టౌన్/జఫర్‌గఢ్: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు జయంతిని పాలకుర్తి, జఫర్‌గఢ్ మండల కేంద్రాల్లో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్టీఆర్ అందించిన సేవలు ఎన్నటికీ మరువలేనివన్నారు. మొట్టక ఎల్లయ్య, కలకోట రమేష్, కాసర్ల ఏలియా, భిక్షపతి, సారంగం, నర్సింగం, యాకయ్య, బాలయ్య, సమ్మయ్య, వెంకన్న, సోమనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో 'అంగన్‌వాడీ'లు

- 8 నెలల కిరాయి పెండింగ్
- ఇబ్బందుల్లో టీచర్లు, చిన్నారులు



బచ్చన్నపేటలోని అంగన్‌వాడీ కేంద్రం



పాఠాలు బోధిస్తున్న టీచర్(ఫైల్)

బచ్చన్నపేట: గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు చిన్నారులకు సృజనాత్మకతతో కూడిన విద్యను అందించే అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అయితే అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీలకు కిరాయిలు రాక పెండింగ్‌లో ఉండటంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో 50 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాల పరిధిలో పక్కా భవనాలను నిర్మించి నిర్వహిస్తుండగా కొన్ని గ్రామాల్లో మాత్రం అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. బచ్చన్నపేట సెక్టార్‌లో అద్దె భవనాల్లో బచ్చన్నపేట–1, 4, 7, అలింపూర్–2,3, వీఎస్‌ఆర్ నగర్, కేసిరెడ్డిపల్లి–1, భోనకొల్లూర్ గ్రామాల్లో మొత్తం 9 కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. లింగంపల్లి సెక్టార్‌లో ఇటుకాలపల్లి, పోచన్నపేట–1, 2, నారాయణపురం, సాల్వాపూర్, పడమటికేశ్వాపూర్ మొత్తం 6 అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఈ భవనాలను కిరాయికి ఇచ్చిన యజమానులు వచ్చి ఖాళీ చేయమంటే మరో భవనాన్ని అద్దెకు తీసుకోవడానికి చాలా ఇబ్బంది అవుతోంది. అద్దె భవనంలో సరైన వసతులు లేక చిన్నారులు, టీచర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పక్కా భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు మంజూరు చేసినా కొన్ని చోట్ల భూమిపూజ చేసి మరికొన్ని చోట్ల నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేశారు. నిధుల లేమితో భవనాల నిర్మాణాలు నిలిపివేసినట్లు అధికారులు, నాయకులు చెబుతున్నారు. ఇప్పటికైనా పక్కా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించాలని పలు గ్రామాల చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

అద్దె రావడం లేదు..



తమ అంగన్ వాడీ కేంద్రానికి పక్కా భవనం లేక 16 సంవత్సరాలుగా అద్దె భవనంలో నిర్వహిస్తున్నాం. యజమాని నెలనెలా కిరాయి కావాలని అంటున్నారు. 8 నెలలుగా అద్దె రావడం లేదు. ప్రతీ నెల నా జీతంలో నుంచి రూ. 1,000 రెంట్ చెల్లిస్తున్నా. కిరాయి మారినప్పుడల్లా చాలా ఇబ్బంది అవుతోంది.

– బొడిగం వనజ, అంగన్‌వాడీ టీచర్, బచ్చన్నపేట

నివేదిక పంపించాం..



మండలంలో 15 అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నాం. మంజూరైన పక్కా భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ విషయాన్ని పై అధికారులకు నివేదిక పంపించాం. అద్దె భవనాలకు నెలనెలా కాకుండా ఆరు నెలలకు ఇకసారి మాత్రమే అద్దె వస్తోంది. అద్దెకు తీసుకునే సమయంలో ఇట్టి విషయాన్ని యజమానులకు తెలియాలని, అలాగే అన్ని వసతులతో కూడిన భవనాన్నే కిరాయి తీసుకోవాలని సూచించాం.

– మనోహర, సెక్టార్ సూపర్‌వైజర్

కొలతల ప్రకారం పనిచేయాలి



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న రఘురామకృష్ణ

బచ్చన్నపేట: ఈజీఎస్ కూలీలు కొలతల ప్రకారం పనిచేయాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఎండల దృష్ట్యా ఉదయం పూట పనులకు వెళ్లాలని కూలీలకు సూచించారు. మస్టర్లు ప్రతీరోజు కూలీల హాజరు తప్పకుండా వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ, షూ పంపిణీ



షూ అందుకున్న విద్యార్థులతో దాతలు

జనగామ రూరల్: మానవతా దృక్పథంతో పట్టణానికి చెందిన సొప్పరి సత్తయ్య పద్మ, రాజేష్ రమ్య మంగళవారం పట్టణంలోని బాలసదనం బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ, స్కూల్ షూ, బుక్స్, 25 కిలోల బియ్యంను అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో బీమ్‌రాజ్, గుర్రం నాగరాజు, సుప్రీం, లక్ష్మణ్, నరేష్, సాయి, మహేష్, కార్తీక్, నర్సింహులు, రవి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

చిల్పూరు: శ్రావణ నక్షత్రం పురస్కరించుకుని మంగళవారం బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ శ్రీవారికి విశేష సేవల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ లక్ష్మిప్రసన్న–విస్వక్సేన చౌదరి, ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి, మామిడాల యాదవరెడ్డి–జానకి, కాండూరి రంగరాజు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. మంగళవారం నిర్వహించిన పూజలకు కరంనగర్‌కు చెందిన కిషన్‌పటేల్ రూ.19,016, పల్లగుట్టకు చెందిన శ్రీధర్‌రావు–కిరణ్మయి దంపతులు రూ. 8,000, వెంకట్రామిరెడ్డి రూ. 8,000, చందర్ రూ.6,200, చిల్పూరుకు చెందిన గొల్లపల్లి సారయ్య రూ. 5,000, రాజేష్ ఫ్రూట్స్ రూ.6,000, గుల్లపల్లి శ్రీనివాస్–భవాని రూ.1,700, కిషోర్‌కుమార్ రూ.6,000 వేలు అందజేశారని ఈఓ తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నర్మెట: స్థానిక మోడల్ కాలేజీలో 2024–25 విద్యా సంవత్సరానికి పది ఉత్తీర్ణత పొందిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.శరత్ కుమార్ మంగళవారం తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్న మోడల్‌కాలేజీలో ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఆలయాల్లో ఘనంగా మహాయజ్ఞం



జఫర్‌గఢ్: మహాయజ్ఞంలో మాలధారులు



బచ్చన్నపేటలో..

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేట గ్రామంలో మల్లికార్జునస్వామి ఆలయం వద్ద మంగళవారం పూజారి పుణ్యమూర్తిశర్మ ఆధ్వర్యంలో హనుమాన్ మాలధారులు మహాయజ్ఞం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహా అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో స్వాములు గాదె వెంకన్న, కోట గణేష్, బుంగాని రాజు, మోడం అరవింద్, రవి, పరమేష్ సందీప్, రాకేష్, రాజు, ఎల్లస్వామి, భక్తులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయంలో..

బచ్చన్నపేట: మండలకేంద్రంలోని హనుమాన్ మాలధారులు స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి చందన, తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్వేతార్క, మల్లె, కనకాంబరాలు, మినుమువడల హారాలతో స్వామిని అలంకరించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సంక్షిప్త సమాచారం

'రాకేశ్‌రెడ్డి విజయం ఖాయం'

కొడకండ్ల: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని మార్కెట్ చైర్మన్ పేరం రాము అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వ్యూహప్రతివ్యూహాలతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ బలంతో రాకేశ్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందుతారని, ఇతర పార్టీల ఓటర్లు కూడా రాకేశ్‌రెడ్డికి మద్దతుగా నిల్వారని, ఆయన గెలుపు కోసం ప్రత్యక్షంగా పరోక్షంగా కృషి చేసిన వారందరికి రాము కృతజ్ఞతలు తెలిపారు.

విత్తన కొనుగోలుపై నేడు సదస్సు

దేవరుప్పుల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద నేడు(బుధవారం) ఉదయం 9 గంటలకు వానాకాలం సాగు కోసం సమయత్తమవుతున్న రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో అప్రమత్త చర్యలు తీసుకునేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏఈఓ సూదగాని సాగర్ తెలిపారు. విధిగా గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

ఉపాధి పనులపై నేడు ప్రజావేదిక

దేవరుప్పుల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల విషయమై నేడు(బుధవారం) మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు 5వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం (ఇన్‌హౌజ్) నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. విధిగా ఉపాధి హామీ అనుబంధ అధికారులు, సిబ్బందితోపాటు ఉపాధి కూలీలు, పలు వర్గాల ప్రజలు పాల్గొని తమ సందేహాలకు నివృత్తి చేసుకోగలరని సూచించారు.

భూవివాదంలో వ్యక్తిపై దాడి



దాడిలో గాయపడిన మహిపాల్‌రెడ్డి

బచ్చన్నపేట: భూ వివాదంలో వ్యక్తిపై దాడి చేసిన సంఘటన మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు, ఎస్సై కంకల సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మాపూర్ గ్రామ సమీపంలోని భూమి విషయంలో ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. నూకల భూపాల్‌రెడ్డి, నూకల మహిపాల్‌రెడ్డిలు అన్నదమ్ముల పిల్లలు. వీరి వ్యవసాయ భూములు పక్క పక్కనే ఉన్నాయి. వ్యవసాయ భూముల విషయంలో జరిగిన గొడవలో మాటామాటా పెరిగి వివాదం పెద్దదైంది. భూపాల్‌రెడ్డి కర్రతో మహిపాల్‌రెడ్డిపై దాడి చేయగా అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామన్నారు. గాయపడ్డ మహిపాల్‌రెడ్డి జనగామ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వరదకు అడ్డుగా మొరం పోయొద్దు



మొరం కుప్పలను పరిశీలిస్తున్న తహసీల్దార్

రఘునాథపల్లి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వరద వచ్చే కల్వర్టులకు అడ్డుగా మొరం పోయొద్దని తహసీల్దార్ పురం యుగేందర్ స్పష్టం చేశారు. వరద ప్రవాహ వ్యవస్థను మూసి వేయడంతో 'జాతీయ రహదారికి పొంచి ఉన్న ముప్పు' అనే శీర్షికతో ఈ నెల 22న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. హనుమకొండ–హైదరాబాద్ జాతీయ రహదారిలోని రఘునాథపల్లి సబ్‌స్టేషన్ సమీపంలో కల్వర్టుకు ఇరువైపులా అడ్డుగా మట్టి, బండరాళ్లు వేసి నిర్మాణాలు, లే అవుట్లను పంచాయతీ కార్యదర్శి కవితతో కలిసి తహసీల్దార్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వరద నీరు వచ్చే వాగులకు అడ్డుగా మొరం పోస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వాగు నీటికి అడ్డుగా పోసిన మట్టిని వెంటనే తొలగించి వరద ప్రవాహానికి అంతరాయం లేకుండా చూడాలని జీపీ కార్యదర్శిని ఆదేశించారు.

పాఠశాలలకు ఐఎఫ్‌పీ బోర్డులు



బోర్డులతో నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తి, జీడికల్, మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ పాఠశాలలకు ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులను ప్రభుత్వం అందజేసింది. గతంలో మన ఊరు–మనబడికి ఎంపికైన పాఠశాలలకు రాగా నేడు మరో నాలుగు పాఠశాలలకు బోర్డులను అందజేశారు. సుమారు ఒక్కొక్కటి రూ.7 లక్షల విలువ ఉంటుందని, ఈ బోర్డుపై విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధించడమే కాకుండా బ్లాక్ బోర్డులుగా వినియోగించుకొనే అవకాశం ఉంటుందని నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

జఫర్‌గఢ్: బాధిత కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మండలంలోని ఉప్పుగల్లు గ్రామానికి చెందిన బైరి యాదగిరి మృతి చెందడంతో ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పార్టీ బృందంతో కలిసి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఇదే గ్రామంలోని అనారోగ్యంతో బాధపడుతున్న బైరి చంద్రమోళి, బైరి ఎల్లయ్య, గంగాదరి కోమలను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎంపీపీ రడపాక సుదర్శన్, వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు మంచాల ఎల్లయ్య, పొరెడ్డి సత్యనారాయణరెడ్డి, గుజ్జరి రాజు, పెద్దిరెడ్డి, గండి రమేష్ ఉన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడటమే సీపీఎం ధ్యేయం



మాట్లాడుతున్న రమేశ్

చిల్పూరు: ప్రజా సమస్యలపై పోరాడటమే సీపీఎం ధ్యేయమని మండల కార్యదర్శి సాదం రమేశ్ అన్నారు. మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామంలో మంగళవారం పార్టీ గ్రామ శాఖ సమావేశం గద్ద కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ఈనెల 31, జూన్ 1వ తేదీన నియోజకవర్గం కేంద్రంలో జిల్లా స్థాయి శాఖ కార్యదర్శులు, మండల, పట్టణ కమిటీ సభ్యులకు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులకు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మూడిక భీమయ్య, రాజు, రామరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



కడియం శ్రీహరిని ఆహ్వానిస్తున్న నాయకులు

రఘునాథపల్లి: మండలంలోని కోమల్లలో ఈ నెల 30న నిర్వహించనున్న వేణుగోపాలస్వామి కల్యాణోత్సవానికి హాజరు కావాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని గ్రామస్తులు ఆహ్వానించారు. కాంగ్రెస్ గ్రామ ముఖ్య నాయకులు హనుమకొండలో కడియం నివాసానికి మంగళవారం చేరుకొని వేణుగోపాలస్వామి కల్యాణోత్సవ ఆహ్వాన ప్రతిని అందజేశారు. తమ ఆహ్వానానికి కడియం సానుకూలంగా స్పందించి 30న కల్యాణోత్సవానికి రానున్నట్లు తెలిపారని వారు పేర్కొన్నారు. కడియంను ఆహ్వానించిన వారిలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బొల్లపల్లి కుమారస్వామి, నాయకులు సుల్తాన్ నరసింహారెడ్డి, తాటికొండ వెంకటేష్‌యాదవ్, బాల్నె పర్శరాములు, వెలిశాల స్వామి, బంద కుమారస్వామి ఉన్నారు.

రఘునాథ్‌పల్లి రోడ్డు అధ్వానం

- ఇబ్బందుల్లో ప్రయాణికులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



గుంతలమయంగా ఉన్న రఘునాథ్‌పల్లి రోడ్డు

జఫర్‌గఢ్: మండలంలోని రఘునాథ్‌పల్లి రోడ్డు ఎన్నో ఏళ్లుగా ఎలాంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో అధ్వానంగా మారింది. దీంతో రోడ్డు మీదుగా వెళ్లే ప్రయాణికులు, వానదారులు నరక యాతన పడుతున్నారు. కూనూర్ గ్రామం నుంచి రఘునాథ్‌పల్లి మీదుగా వెంకటాపూర్ క్రాస్ వరకు వేసిన బీటీ రోడ్డు కంకర తేలి గుంతలమయమై పూర్తిగా దెబ్బతింది. 2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కాజీపేట నుంచి వెంకటాపూర్ క్రాస్ మీదుగా రఘునాథ్‌పల్లి–కూనూర్ గ్రామం వరకు బీటీ రోడ్డును నిర్మించింది. ఇదే రోడ్డు మీదుగా జఫర్‌గఢ్ మండల కేంద్రం నుంచి కోనాయిచలం, కూనూర్, గర్మిళ్లపల్లి, తిడుగు, ఉప్పుగల్లు, సాగరం తదితర గ్రామాల ప్రజలు నిత్యం కాజీపేట, హనుమకొండ, వరంగల్ తదితర ప్రాంతాలకు ప్రయాణం సాగిస్తుంటారు. వాహనాల తాకిడితో పాటు రహదారి గుండా నిత్యం ఇసుక ట్రాక్టర్లు వెళ్తుండడం వల్ల రహదారి పూర్తిగా దెబ్బతింది. కూనూర్ నుంచి రఘునాథ్‌పల్లి మీదుగా వెంకటాపూర్ క్రాస్ వరకు సుమారు 8 కిలోమీటర్లకు పైగా రోడ్డు అధ్వాన్నంగా మారింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

రోడ్డు మరమ్మతుతో పాటు వెడల్పు చేయాలి



కూనూర్ నుంచి వెంకటాపూర్ వరకు ఉన్న రోడ్డు దెబ్బతిని ఎన్నో ఏళ్లు అవుతోంది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే నరకం చూడాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో తరచుగా ప్రమాదాల జరుగుతున్నాయి. ఇప్పటికైనా రోడ్డును బాగుచేయడంతో పాటు డబుల్ రోడ్డుగా మార్చినట్లయితే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– ఈగ కృష్ణమూర్తి, కూనూర్

ఎవరూ పట్టించుకోవడం లేదు



రోడ్డు దెబ్బతిని ఏళ్ల గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు మీదుగా ప్రయాణం చేయాలంటే నానా అవస్థలు పడుతున్నాం. ఎప్పుడు ఏ గుంతలో పడి ప్రమాదం కొనితెచ్చుకోవాల్సి వస్తుందోనని భయంతో వెళ్తున్నాం. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతు చేసి ప్రజల ఇబ్బందులు తొలిగించాలి.

– కలకోట్ల వినయ్, కూనూర్

కాలభైరవుడికి, ముత్యాలమ్మకు జలాభిషేకం



కొడకండ్ల: ప్రజలు ఆరాధ్యదైవంగా కొలుచే కాలభైరవస్వామి, ముత్యాలమ్మకు మంగళవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో జలాభిషేకం నిర్వహించారు. గంగపుత్ర కులస్తులంతా కలిసి 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించి పాడిపంటలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని కొరుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గంగపుత్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సింగరం శ్రీనివాస్, ధర్మేంద్రకుమార్‌లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి గోదుమల వెంకటయ్య, కొప్పు నర్సయ్య, సంపత్ పాల్గొన్నారు.